సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



ఉపాధిలో అవినీతి కొండంత..

సామాజిక తనిఖీ బృంద సభ్యులే ఉపాధిహామీ పనుల్లో కొండంత అవినీతిని గోరంతగా చూపించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. - 8లో



వీధి కుక్కల స్వైర విహారం

రామసముద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రెండురోజులుగా ఊటుగొల్లపల్లి, గాజులనగర్ కాలనీల్లో మేకలు, ఆవుదూడలు, చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.410	రూ.530
రెండోరకం	రూ.270	రూ.400

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 103 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : సమస్యలపై అర్జీలు అందించే వారికి అండగా నిలిచి చట్టపరిధిలో వాటిని పరిష్కరించాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఎస్పీ స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భూ ఆస్తి వివాదాలు తదితర సమస్యల గురించి ఫిర్యాదుదారులు విన్నవించుకున్నారు. వీటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు.

ఒంటిమిట్ట రామయ్యకు రూ.10లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి నెలవారి హుండీ ఆదాయం సోమవారం టీటీడీ అధికారులు లెక్కించారు. జూలై 18 నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా 10 లక్షల, 23 వేల, 681 రూపాయల నగదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

వైభవంగా పల్లకీసేవ



భద్రకాళీ సమేతుడి పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడుకి భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయంలోని మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. మాఢవీధిలో, ఆలయ ఆవరణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి,శేఖర్ స్వామి, రాచరాయ యోగి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

పింఛా ప్రాజెక్టు నుంచి నీటి విడుదల



పింఛా ప్రాజెక్టుకు పూజలు చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సుండుపల్లె : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పింఛా ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరదనీరు వచ్చింది. ప్రాజెక్టు పొంగి పొర్లుతోంది. ఈనేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. పింఛా ప్రాజెక్టు కెపాసిటీ 327.60 ఎంసీఎఫ్‌టీలకు చేరుకుందన్నారు. ప్రాజెక్టు నుంచి కిందకు నీటిని విడుదల చేయడంతో కుడికాలువ ఆయకట్టు ద్వారా 2,211 ఎకరాలకు, ఎడమ కాలువ ఆయకట్టు ద్వారా 1,562 ఎకరాలకు మొత్తం 3,773 ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలకు నీటిని అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. అదే విధంగా ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకట్రామయ్య, డీఈ చెంగల్‌రాయులు, తహసీల్దార్ మెహబూబ్‌చాంద్, నీటిపారుదల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం దొరకని వేదిక

ఆలకించరు.. ఆదుకోరు

- ప్రతి సోమవారం కలెక్టరేట్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్నా దొరకని ఫలితం
- బాధితులకు తప్పని ఇబ్బందులు

సాక్షి రాయచోటి : అనేక బాధలు వెంటాడుతున్నాయి.. కష్టాలు మెండుగా ఉన్నాయి..ఎన్ని పోరాటాలు చేసినా, ఎంత ఆవేదన వెలిబుచ్చినా న్యాయం దొరకక వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి బాధితులు పరుగులు తీస్తున్నారు. అయినా పరిష్కారం దొరకకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పదే పదే తిరుగుతున్నా కలెక్టర్ స్థాయి అధికారి వద్దకు వెళ్లిన కొంతమంది బాధితులకు మాత్రమే ఊరట లభిస్తుండగా, మిగతా సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. జిల్లాలోని మూరుమూల ప్రాంతాల నుంచి కూడా ప్రతిసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎన్నెన్నో కష్టాలు, మరెన్నో అవస్థలు పడి ఇక్కడికి వస్తున్నారు.

న్యాయం కోసం

అన్నమయ్య జిల్లాలోని అటు తంబళ్లపల్లె, ఇటు రైల్వే కోడూరు, మదనపల్లె, రాజంపేట ఇలా చెబుతూపోతే దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు కదులుతున్నారు. కానీ పెన్షన్లు, ఇతరత్రా చిన్నపాటి సమస్యలకు కూడా ఒక్కోసారి పరిష్కారం గగనంగా మారుతోంది. అత్యధికంగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలతో బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. అలాగే ఆన్‌లైన్, అధికార పార్టీ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్న స్థలాలను విడిపించమని ఫిర్యాదులు వస్తున్నాయి. దివ్యాంగులు, వృద్ధులు, ఇతర వ్యక్తిగత సమస్యలతో ప్రతి సోమవారం 250-300 మంది వరకు వస్తున్నారు. ప్రధానంగా ఇంటి పట్టా, ఉద్యోగాలు, రుణాల కోసం, పరిహారం ఇలా అనేక సమస్యలతో కలెక్టరేట్‌కు న్యాయం కోసం వస్తున్నారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పరిశీలించిన అర్జీల విషయంలో కొంచెం ప్రత్యేక శ్రద్ధ చూపుతుండడంతో కొంతమేర ఫలితం కనిపిస్తోంది. మిగతా వాటికి సంబంధించి ఆయా శాఖల్లో ప్రయోజనం పెద్దగా ఉన్నట్లు లెక్కల్లో గ్రేడ్లు వేసుకుంటున్నా చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు వాపోతున్నారు.

- పీలేరు టౌన్ పరిధిలోని బాలాజీ నగర్ అజంతా వీధికు చెందిన బాషా సాహెబ్ తనకు రెండు చెవులు పనిచేయవని, వినికిడి యంత్రంతోపాటు వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించారు.
- వాల్మీకిపురానికి చెందిన హెచ్.రామచంద్ర తనకు కలిగిరి మండలం గుండ్లూరు నందు ఖాతా నంబర్ 1655లో 1484/1ఏలో ఒక ఎకరా భూమి ఉందని, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం డబ్బులు వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామస్తులైన రామేశ్వర స్వామి అకౌంట్‌లో జమ అవుతోందన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి పీఎం కిసాన్ పథకం డబ్బులు తన ఖాతాకు జమ అయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.
- కేవీ పల్లి మండలం మారెళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని పిచ్చావాండ్ల పల్లికు చెందిన రెడ్డప్ప తనకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ 4000 రూపాయలు వస్తున్నదని, నాకు కుడి చెయ్యి లేదని, కూలి పనులు చేసుకొనుటకు కష్టంగా ఉందని నాకు వికలాంగుల కోటా కింద పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు తెలియజేశారు.



మదనపల్లె పరిధిలోని రామసముద్రం మండలం రాగిమాకులపల్లె క్రాస్ వద్దగల దర్గాకు చెందిన ముస్లింలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న ముస్లిం మైనార్టీలు మదనపల్లె పరిధిలోని రామసముద్రం మండలం రాగిమాకులపల్లె క్రాస్ వద్ద ఉన్న దర్గాకు చెందిన వారు. ఖాదరిక్లామస్ దర్గా కమిటీకి సంబంధించి కొంత భూమి ఉంది.దర్గా పరిధిలో పనిచేసే ముతవల్లి పేరుతో గతంలో ఉండగా, ఆయన అనంతరం ప్రస్తుత కమిటీకి రావాల్సి ఉండగా వాళ్ల కుమారుడు ఆధీనంలోకి తీసుకున్నారని కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక సొసైటీ, దర్గాకు సంబంధించిన స్థలాన్ని పరాయి వ్యక్తుల ఆధీనం నుంచి రక్షించాలని విన్నవించారు. 15-20 రోజుల్లో దర్గాకు సంబంధించి ఉరుసు ఉత్సవాలు ఉన్నాయని, అక్కడ జరపడానికి కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు.

పింఛన్లను తొలగించారు



డీఆర్‌డీఏ అధికారి సత్యనారాయణకు వినతి పత్రం సమర్పిస్తున్న మట్లి సర్పంచ్ ఆచారి

వీరబల్లి మండలం మట్లి పరిధిలో ఒకే ఊరిలోనే సుమారు 40 మంది దివ్యాంగుల పింఛన్లను అనర్హుల పేరుతో తొలగించారు. వాటిలో 10 పింఛన్లు మార్పుచేసి సాధారణ పింఛన్లుగా రూ. 4 వేలు అందిస్తున్నారు. మిగిలిన 30 మందికి అన్యాయం జరుగుతోందని మట్లి సర్పంచ్ ఆచారి డీఆర్‌డీఏ అధికారి సత్యనారాయణకు విన్నవించి న్యాయం చేయాలని కోరారు.

చంద్రబాబు సర్కార్ అన్యాయం చేస్తోంది



కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నేతలు, బీసీ వర్గాలు

రాష్ట్రంతోపాటు జిల్లాలోని బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ నేతలు ఆందోళన నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్‌వద్ద బ్యానర్‌తో నినదించారు. ప్రధానంగా చంద్రబాబు హయాంలో 2014లోనూ అన్యాయం చేశారని, ప్రస్తుతం కూడా ఇదే వైఖరి కొనసాగుతోందని వారు వివరించారు. బీసీలకు సంబంధించి 34 శాతం కాకుండా 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని వారు డిమాండ్‌చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేడు ఆకేపాడుకు వైఎస్ జగన్ రాక



కడప కార్పొరేషన్/రాజంపేట : అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం ఆకేపాడుకు ఈనెల 19వ తేదీ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సోదరుడి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో ఆయన పాల్గొననున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు వైఎస్ జగన్ రాజంపేట మండలం బాలిరెడ్డిగారిపల్లె హెలీ ప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన ఆకేపాడు చేరుకుని, ఆకేపాటి ఎస్టేట్స్‌లో ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి తిరుగు పయనమవుతారు.

హెలిప్యాడ్ పరిశీలన

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి ఆకేపాడుకు చేరుకోనున్నారు. ఇందుకోసం హెలిప్యాడ్ సిద్ధం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి హెలీప్యాడ్‌ను పరిశీలించారు.ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీనేతలు పాల్గొన్నారు.



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

భూమి ఆన్‌లైన్ కోసం బాధ భరిస్తూ..



కలెక్టర్ కార్యాలయం వద్ద మర్రిపాటి శంకరయ్య

ఆక్సిజన్ సిలిండర్‌తో కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుడు

రాయచోటి : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న తనకు ఊపిరిపోయేలా ఉందని బాధితుడు మర్రిపాటి శంకరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి ఆక్సిజన్ సిలిండర్‌తో తనకున్న సమస్యను గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు విన్నవించుకోవడానికి వచ్చారు. కలకడ మండలం రాతిగుంటపల్లి పంచాయతీ దేవలపల్లికి చెందిన మర్రిపాటి శంకరయ్యకు నడిమిచర్ల పంచాయతీలోని సర్వే నంబర్ 733/1లో 5 ఎకరాల 19 సెంట్లు భూమి ఉంది. 1970లో దళితులకు ప్రభుత్వం పట్టాలిచ్చి వ్యవసాయం చేసుకొనేలా అవకాశం కల్పించిందన్నారు. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ భూమి గ్రామానికి చెందిన వెంకటరాయుడు, రెడ్డప్పల పేరు మీద ఆన్‌లైన్ అయిందన్నారు. భూమికి సంబంధించిన రికార్డులు కూడా మా దగ్గరే ఉన్నాయన్నారు. రికార్డుల ప్రకారం మా భూమిని సర్వే చేసి మా పేరున ఆన్‌లైన్ చేయాలని కలకడ తహసీల్దార్‌ను కోరామన్నారు. స్థానికంగా ఉన్న వీఆర్‌ఓ, సర్వేయర్, డీటీలు కలిసి మా భూమి మాకు చెందనీయకుండా ఇతరులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిలో పేర్కొన్నారు. ఊపిరితిత్తుల వ్యాధితో వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనకు వైద్యుల సలహా మేరకు రోజుకు 17 గంటలు ఆక్సిజన్‌ను సిలిండర్ ద్వారా తీసుకోవాల్సి ఉందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నాకు భార్య పిల్లలు కూలి పనిచేసి వైద్యం అందిస్తున్నారన్నారు. అనారోగ్యంతో ఉన్న నేను నా భార్యతో కలిసి స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా వారి నుంచి స్పందన రాకపోవడంతో విధిలేని పరిస్థితిలో కలెక్టర్‌కు సమస్యను విన్నవించుకోవడానికి వచ్చినట్లు శంకరయ్య తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 89855 97928, 99854 42196 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మద్యం కేసులో ముద్దాయిలకు దేశ బహిష్కరణ!

- కువైట్‌కు మళ్లీ రాకుండా నిషేధిత జాబితాలో పేర్లు
- అరెస్టు అయిన వారిలో కడప జిల్లా వాసులు



కువైట్‌లో నాటుసారా కేంద్రంలో పట్టుబడిన తయారీదారులు



కల్తీమద్యం కేంద్రాలకు సీల్ వేస్తున్న కువైట్ పోలీసు

రాజంపేట : కల్తీమద్యం, నాటుసారా బాధితులను కువైట్ దేశం బహిష్కరించింది. దేశం విడిచి వెళ్లేలా అన్ని చర్యలు తీసుకుంది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వారు కూడా కువైట్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఎవరెవరు ఉన్నారనేది మాత్రం ఇండియన్ ఎంబీసీ వెల్లడి చేయడంలేదు. దీంతో గల్ఫ్ కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

భవన నిర్మాణ కార్మికులలో అలజడి

కల్తీ మద్యం దుర్ఘటనతో విస్తృత తనిఖీల్లో భాగంగా కువైట్ పోలీసులు ముతల్లా (కొత్తగా నిర్మితమవుతున్న ప్రాంతం)లో తనిఖీలు చేశారు. అనధికారికంగా అనేక మంది తెలుగువారు ఉండటాన్ని గుర్తించారు. వారిని అరెస్టు చేశారు. ఆర్టికల్ 20 కింద వచ్చిన వారంతా నివాసపత్రాలు సరిగ్గా లేకపోవడంతో కార్మికులను కువైట్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణ, కార్మిక రంగానికి చెందిన వారు అధికంగా ఉన్నట్టు అక్కడివారు తెలియజేశారు. బేల్దారి, పెయింటర్స్, కూలీలుగా పనిచేసేందుకు కువైట్‌కు వెళ్లిన వారి కుటుంబాల్లో అలజడి మొదలైంది. ఈ వింగ్‌లో ఉమ్మడి కడప జిల్లా నుంచి అనేకమంది వెళ్లారని కువైట్ వర్గాలు చెబుతున్నాయి. ఆర్టికల్ 18 కింద కువైట్‌లో ఉన్న కార్మికులలో అనేక మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

మహబుల్లాలో 23 మందికి పైగా ప్రాణాలను విషాదకరంగా బలి తీసుకున్నట్లుగా 71 మంది వ్యక్తులను పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు రెఫర్ చేశారు. ఇలా ఉంటే మహబుల్లాలో తనిఖీ చేసిన అక్కడి పోలీసులు 278 మందిని అరెస్టు చేయగా ఇందులో ఉమ్మడి కడప జిల్లా వాసులు కూడా ఉన్నారనే సంకేతాలు గల్ఫ్ కుటుంబీకుల ద్వారా అందుతోంది. ఏపీలో పలు జిల్లాలకు చెందిన తెలుగువారు కూడా కల్తీ మద్యం దుర్ఘటనలో బాధితులుగా ఉన్నారని సమాచారం సంబంధీకులకు చేరుతోంది.

తిరిగి రాకుండానే..

విషపూరిత మద్యం తాగి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవాసాంధ్రులందరూ మరోసారి కువైట్‌కు రాకుండా ఆ దేశాధికారులు వారి పేర్లను నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో అప్పులు చేసి కువైట్ వెళ్లిన వారి పరిస్థితి దారుణంగా తయారైంది. అటు అనారోగ్యం, మరోవైపు అప్పులతో ఇంటిముఖం పడుతున్నారు. తిరిగి తాము కోలుకుంటామో లేదా అన్న బెంగ బాధితులను వెంటాడుతోంది. కువైట్‌కు వెళ్లి నాలుగు రాళ్లు వెనుకేసుకుందామని అనుకుంటే కల్తీ, నాటుసారా నట్టేట ముంచేసింది.

దేవునికడప ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రక్రియ సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. బాలాలయ సంప్రోక్షణకు శాస్త్రోక్తంగా అంకురార్పణ, బాలబింబాలకు జలాధివాసం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆల య ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించి బుధవారం బాలాలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకు వస్తారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారు, అండాళమ్మ వారి గర్భాలయాన్ని, విమాన గోపురాన్ని, రాజ గోపురాలకు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు బదులుగా గర్భాలయం ఎదురుగా మండపంలో బాలాలయం నిర్మాణం చేపట్టారు. జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యే వరకు భక్తులు బాలాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాల్సి ఉంటుంది. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే నిత్య, నైమిత్తిక, కామ్య కై ంకర్యాలు యథావిధిగా బాలాలయంలో నిర్వహిస్తారు.



బాలాలయ సంప్రోక్షణకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

- రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దేవుని కడప ఆలయం ఒకటి. తిరుమల తొలిగడపగా పేరున్న ఈ ఆలయంలోని స్వామిని జనమే జయ మహారాజు ప్రతిష్ఠించారని చెబుతారు. కైఫీయత్తుల ప్రకారం తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయ రాజగోపురం, దేవుని కడప ఆలయ రాజ గోపురం ఒకేసారి నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఆలయంలోని రాజగోపురంతోపాటు ముఖ మండపం, గర్భాలయం, అంతరాళం, ప్రాకారం, మట్లి అనంత భూపాలుడు నిర్మించినట్లు తెలుస్తోంది. వైదుంబులు, ఓరిగంటి రాజులు, వల్లూరు పాలకులు, సంబెటరాజులు, సాళువ, సంగమ, తుళువ వంశీకులు ఈ క్షేత్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. శ్రీకృష్ణ దేవరాయలు పలు మార్లు కడప రాయుడిని దర్శించినట్లు చరిత్ర చెబుతోంది. పురా తన ఆలయం కావడంతో టీటీడీ జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టింది.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందిన చాంద్‌బాషా

మదనపల్లె రూరల్ : ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండకు చెందిన ఇమామ్‌బాషా కుమారుడు షేక్ చాంద్‌బాషా(65) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పొలం దున్నేందుకు ట్రాక్టర్ తీసుకుని స్థానికంగా ఓ యజమాని పొలంలో పనిచేసేందుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా, ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో నుంచి రోడ్డుపక్కనే ఉన్న కుంటలో పడిన చాంద్‌బాషా నీట మునిగి మృతిచెందాడు. అయితే, పనులకు వెళ్లిన చాంద్‌బాషా ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించడంతో నీటికుంటలో బయటపడ్డాడు. దీంతో మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై తాలూకా పోలీసులును విచారించగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ



జేఎల్ఎం అవినీతిపై రైతులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారి

ఓబులవారిపల్లె : చిన్న ఓరంపాడు జేఎల్ఎం ఖలీల్‌పై గ్రామ రైతులు చేసిన అవినీతి ఆరోపణలపై సోమవారం రైతులతో విద్యుత్ శాఖ విజిలెన్సు అధికారులు విచారణ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీమ్ తనిఖీలు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వస్తున్న క్లూస్ టీమ్ సభ్యుడు

గాలివీడు : మండల కేంద్రమైన గాలివీడులోని గౌతమ్ పాఠశాల వద్ద ఆటో డ్రైవర్ మల్లయ్య ఇంట్లో జరిగిన రూ.3 లక్షలు నగదు,12 తులాల బంగారం చోరీకి సంబంధించి సోమవారం క్లూస్ టీమ్ సభ్యులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక బృందం స్థానిక ఎస్ఐ రామకృష్ణతో కలిసి దొంగల జాడ కోసం చోరీ జరిగిన ఇంటిని జల్లెడ పట్టారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, చోరీపై గల సందేహాలను కుటుంబ సభ్యులను అడిగి ఆరా తీశారు.

లారీ ఢీ కొని యువకుడి మృతి

చాపాడు : మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని కేతవరం గ్రామ సమీపంలో సోమవారం లారీ ఢీ కొని మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన ఎల్లనూరు సునీల్‌కుమార్(31)అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు సునీల్ కుమార్ ఉదయం కేఏ01ఏపీ 8756 నెంబరు గల బైక్‌లో మైదుకూరుకు వెళుతుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న టీఎల్ 88జే 2621 నెంబరు గల లారీ బైక్‌ను ఢీ కొంది. సునీల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ఉపాధిలో అవినీతి కొండంత.. తేల్చింది గోరంత

- సామాజిక తనిఖీ బృందం చేతివాటం
- వెలుగుచూడని అవినీతి అక్రమాలు



గుర్రంకొండ ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభలో వివరాలు చదివి వినిపిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు (ఫైల్)

గుర్రంకొండ : ఉపాధిహామీ పనుల్లో అధికారులు, సిబ్బంది చేసిన అవినీతిని బట్టబయలు చేసేందుకు సామాజిక తనిఖీ బృందం విచారణ నిర్వహిస్తుంది. అలాంటి సామాజిక తనిఖీ బృందం సభ్యులే అవినీతికి పాల్పడి వెలుగు చూడాల్సిన అవినీతిని కప్పిపుచ్చి కొండంత అవినీతిని గోరంతగా చూపించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 2024–25 ఏడాదికి రూ.5.50 కోట్ల మేరకు ఉపాధి హామీ పనులు జరిగాయి. సుమారు పదిహేను రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం సదరు ఉపాధి హామీ పనులపై విచారణ జరిపారు. ఇటీవల మండల కేంద్రమైన గుర్రంకొండలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించి గ్రామాల వారీగా ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి చదివి వినిపించారు. అయితే సామాజిక తనిఖీ బృందం సభ్యులు పలు గ్రామాల్లో జరిపిన విచారణలో చేతి వాటం ప్రదర్శించారనే విషయం ఆలస్యం వెలుగు చూస్తోంది. డబ్బులు ముట్టజెప్పినప్పటికీ కొంతమంది సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమను మోసం చేసి బహిరంగ సభలో తప్పులను ఎత్తి చూపారంటూ ఉపాధిహామీ సిబ్బంది బహిరంగంగా విమర్శిస్తున్నారు. మచ్చుకు ఉదాహరణగా మండల కేంద్రానికి సమీపంగా ఉండే ఒక గ్రామంలో ఓ డీఆర్పీ ఆ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించారు. విచారణలో రూ. 3 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు తేలింది. అయితే ఈ విషయాన్ని సామాజిక తనిఖీ బహిరంగ సభలో బయట పెట్టకూడదంటూ సదరు డీఆర్పీతో బేరసారాలు సాగించారు. రూ. 50 వేలు నుంచి బేరం ప్రారంభించి రూ.20 వేలుకు అంగీకరించారు. దీంతో సదరు గ్రామంలో అసలు అవినీతే జరగనట్లు బహిరంగ సభలో నివేదిక సమర్పించడం గమనార్హం. ఇదే మండల కేంద్రానికి సమీపంలోని మరో గ్రామానికి సంబంధించి ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను అకారణంగా సస్పెండ్ చేశారు. అయితే అప్పటికే సదరు ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ఎలాంటి తప్పులు చేయలేదని సామాజిక తనిఖీ బహిరంగ సభలో చెప్పే విధంగా బేరం కుదుర్చుకొని రూ.20 వేలు అప్పటికే ముట్టచెప్పారు. అయినా బహిరంగసభలో ఫీల్డ్ అసిస్టెంట్ తప్పు చేసిందంటూ సదరు డీఆర్పీ చదివి వినిపించడంతో ఆమెను సస్పెండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన నాయకులు, కుటుంబ సభ్యులు సదరు డీఆర్పీని నానా దుర్భాషలాడినట్లు సమాచారం. తప్పులు కప్పిపుచ్చుతానని నమ్మబలికి రూ.20 వేలు తీసుకొ ని ఎలా బహిర్గతం చేస్తావంటూ డీఆర్పీపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. పలు గ్రామాల్లో బేరసారాలు కుదుర్చుకొన్న అనంతరం చివరగా రూ. 5.50 కోట్ల మేరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో కేవలం రూ. 2,39,372 మాత్రమే అవినీతి జరిగినట్లు తేల్చి చేతులు దులుపుకోవడం కొసమెరుపు. వాస్తవంగా పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో రూ. 25 లక్షల మేర అవినీతి జరిగినట్లు సమాచారం. కేవలం సామాజిక తనిఖీ బృందం సభ్యులు చేతివాటం ప్రదర్శించి అవినీతిని తొక్కిపెట్టి, అవాస్తవాలు సామాజిక తనిఖీ బహిరంగ సభలో చదివి వినిపించారని బాహాటంగా స్వయంగా ఉపాధి హామీ సిబ్బందే చర్చించుకోవడం గమనార్హం. అధికారులు ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయని ప్రజలు అంటున్నారు.

నీటి పారుదల శాఖలో అవినీతి పర్వం

సుండుపల్లె : మండలంలోని నీటిపారుదల శాఖలో గత సంవత్సర కాలంలో చెరువులు, కుంటలతో పాటు చెక్‌డ్యాంలు మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ప్రాంతానికి వచ్చిన అధికారి తెగిపోయిన చెరువులను, అలుగు మొరవలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నామని చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలంటే పన్ను కట్టాలా..? అని వారు ప్రశ్నిస్తున్నారు. వివరాలలోకి వెళితే.. కొంతకాలం క్రితం మండలంలోని వివిధ చెరువుల నీటి సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. అప్పటి నుంచి నీటిపారుదల శాఖ ఏఈఈ నాగేంద్ర నాయక్ మండలంలోని కొన్ని చెరువులు, కుంటలు పరిశీలించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఆయా ప్రాంతాల అధికార పార్టీ నాయకులకు తెలిపారు. అనంతరం నాయకులు, కాంట్రాక్టర్లకు ఫోన్లు చేస్తూ ప్రతి పని ప్రతిపాదనకు రూ.5 వేలు ఇవ్వండని సూచించారు. ఇందులో భాగంగానే రాతిచెరువు మొరవ మరమ్మతుల ప్రతిపాదనలతో పాటు మరో రెండు ప్రతిపాదనలకు కలిపి రూ.15 వేలు ఇవ్వాలని కోరినట్లు చెరువు ఆయకట్టు పరిధిలోని ఈడిగపల్లె, పోచంవాండ్లపల్లెకు చెందిన యువకులు పేర్కొన్నారు. దీంతో రైతులు కలిసికట్టుగా కదిలి రాతిచెరువు మొరవ మరమ్మతులు చందాలు వేసుకుని చేసుకున్నట్లు పత్రికలలో వచ్చిన కథనాలను జీర్ణించుకోలేని ఆ అధికారి తాను ఏర్పాటు చేసుకున్న సోషియల్ మీడియా గ్రూపులో అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. దీనిపై ప్రశ్నించిన వారిని ఇరిగేషన్ గ్రూపులో నుంచి తొలగించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు అడగలేదా అని ప్రశ్నించడంతో రైతులను కాదు కాంట్రాక్టర్లను అడిగానని గ్రూపులో మెసేజ్ పెట్టి వెంటనే తొలగించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని, తెగిపోయిన చెరువులు, అలుగులకు మరమ్మతులు చేసి రైతులకు భారం తగ్గించాలని మండలంలోని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

తలసేమియా బాధితుడికి పీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం



తలసేమియా వ్యాధిగ్రస్తుడైన చిన్నారితో తల్లిదండ్రులు

రాయచోటి జగదాంబసెంటర్ : రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామానికి చెందిన పఠాన్ జాబీర్ అహమ్మద్ కుమారుడు షకీల్ అహమ్మద్ తలసేమియా వ్యాధితో పోరాటం చేస్తున్నాడు. ఈ వ్యాధి చికిత్సకు లక్షలాది రూపాయలు అవసరమవుతుండగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ కుటుంబానికి వైద్యఖర్చులు భారంగా మారాయి. తమ కుమారుడి విషమ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ షకీల్ తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని ఆశ్రయించారు. ఆయన వెంటనే స్పందించి ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసును ప్రధానమంత్రి జాతీయ ఉపశమననిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) పరిధిలోకి తీసుకురావాలని, తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి కూడా వెంటనే స్పందిస్తూ షకీల్ మెడికల్ డాక్యుమెంట్లు, సంబంధిత ధ్రువపత్రాలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు. వారి చొరవకు స్పందనగా ప్రధానమంత్రి కార్యాలయం, షకీల్‌కు బెంగళూరులోని ప్రముఖ ఆసుపత్రులలో ఒకటైన భగవాన్ మహావీర్ జైన్ హాస్పిటల్‌లో మేజర్ తలసేమియా చికిత్స నిమిత్తం రూ.3 లక్షల ఆర్థికసాయాన్ని మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని కల్పించిన ఎంపీ మిథున్ రెడ్డికి, వెంటనే స్పందించి మద్దతుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి, కేంద్ర ప్రభుత్వానికి బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన మద్యం పాలసీతో 11 బార్లకు టెండర్లు



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా నూతన మద్యం పాలసీ విధానంలో 11 బార్లకు టెండర్లు వేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. సోమవారం రాయచోటి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బార్ కోసం నాలుగు అంత కన్నా ఎక్కువ టెండర్లు వచ్చే విధంగా ఏర్పాటు చేశామని చెప్పారు. అంత కన్నా తక్కువ టెండర్లు వస్తే దానికి సంబంధించి లాటరీ తీయబడదన్నారు. 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 28వ తేదీ జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామని తెలిపారు. మదనపల్లె మున్సిపాల్టీలో–5, రాయచోటి మున్సిపాల్టీలో–3, రాజంపేట మున్సిపాల్టీలో–2, పీలేరు టూరిజం సెంటర్‌లో–1 చొప్పున ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ప్రతి బార్‌కు రూ.5లక్షలు అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.10 వేలు ప్రాసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మొత్తాన్ని ఎలాంటి పరిస్థితిలో తిరిగి వెనక్కు ఇవ్వరన్నారు. బార్లు మూడు సంవత్సరాల పాటు నిర్వహించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్ పాల్గొన్నారు.

సిమెంట్ లారీ ఢీకొని హోంగార్డు దుర్మరణం



ఈశ్వర్‌నాయక్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : సిమెంట్ లారీ ఢీకొని హోంగార్డు దుర్మరణం చెందిన ఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం కోటకొండ తాండాకు చెందిన షేకే నాయక్, చౌడమ్మ దంపతుల కుమారుడు ఈశ్వర్ నాయక్(50) మదనపల్లెలో హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తూ సబ్ కలెక్టరేట్ కార్యాలయ నైట్‌డ్యూటీ విధులు నిర్వహిస్తుంటాడు. సొసైటీ కాలనీ గేటులో నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య లక్ష్మీబాయి స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తోంది. కుమారుడు హర్షవర్ధన్ నాయక్ ఇంజనీరింగ్ పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండగా, కుమార్తె భవ్యశ్రీ డిగ్రీ చదువుతోంది. ఈశ్వర్ నాయక్ సోమవారం స్వగ్రామమైన కోటకొండ తాండా నుంచి ద్విచక్రవాహనంలో విధులకు హాజరయ్యేందుకు మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలోని కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద సిమెంట్ కంటైనర్ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఈశ్వర్‌నాయక్ తలకు తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. స్థానికులు ముదివేడు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈశ్వర్ నాయక్‌కు ఇద్దరు అక్కలు ఈశ్వరమ్మ, శంకరమ్మ, చెల్లెలు పార్వతి ఉండగా, వారి కుటుంబాలకు అన్ని విషయాల్లోనూ చేదోడువాదోడుగా ఉండే సోదరుడు మృతి చెందడంతో వారు జిల్లా ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు.

మంత్రి ఇలాఖా.. ఉచిత ప్రయాణం ఇలాగా..!



రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులకోసం వేచి ఉన్న ప్రయాణికులు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు పడుతున్న పాట్లు వర్ణణాతీతం. ప్రభుత్వం ఆర్భాటంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టి అవసరమైన బస్సులను ఏర్పాటు చేయడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కడప. తిరుపతి, మదనపల్లి, చిత్తూరు, రాజంపేట, కదిరి బస్సుల కోసం గుంపులు గుంపులుగా ప్రయాణికులు పడిగాపులు కాయడం కనిపించింది. ఉన్న బస్సులను కూడా సకాలంలో తిప్పకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు గంటల తరబడి ఆర్టీసీ బస్టాండ్‌లలో వేచి ఉండాల్సి వస్తోంది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సొంత జిల్లా కేంద్రమైన రాయచోటిలో బస్సుల కొరతతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

అదృశ్యమైన మహిళ దారుణ హత్య

మిస్టరీని ఛేదించిన పోలీసులు

చిన్నమండెం : మదనపల్లె మండలంలో అదృశ్యమైన ఓ మహిళ అత్యంత దారుణంగా హత్యకు గురైన సంఘటన వెలుగు చేసింది. వివరాలు ఇలా.. ఈ నెల 10వ తేదీన మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ సవరంవారిపల్లెకు చెందిన శ్రీదేవి(45) అనే మహిళ అదృశ్యమైనట్లు ఆమె బావ వాసు మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ఆమె అదృశ్యం కేసును ఛేదించినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. శ్రీదేవికి ఆమె అక్క అల్లుడైన శివకుమార్ నాయుడుతో వివాహేతర సంబంధం ఉండేదన్నారు. ఈ క్రమంలో శివకుమార్ నాయుడు తన మోటార్ సైకిల్‌లో శ్రీదేవిని ఎక్కించుకుని చిన్నమండెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవిలో ఆమె చీరతో గొంతుకు ఉరివేసి చంపివేశాడన్నారు. అక్కడే పెట్రోల్ పోసి కాల్చివేశాడన్నారు. శ్రీదేవి కాల్‌డేటా ఆధారంగా శివకుమార్‌నాయుడును అదుపులోకి తీసుకోగా ఈ విషయాలు తెలిశాయన్నారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

ఐదుగురు బైక్ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీసులు

జమ్మలమడుగు : బైకుల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 10వతేదీన ప్రొద్దుటూరు రహదారిలో హోండా యాక్టివా చోరీకి గురైందంటూ బాధితుడు కొక్కొకోల రామమోహన్ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా సోమవారం తమకు దొంగల సమాచారం అందిందన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులోని ఎస్ఆర్ పెట్రోల్‌బంకు వద్ద సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు యువకులు తమ సిబ్బందిని చూసి వాహనాలు వెనక్కి తిప్పుకుని వెళుతుండటంతో సిబ్బంది పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా బైకుల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి పది లక్షల రూపాయల విలువ గల 9 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, దేవదాసు, రియాజ్, నాగేంద్ర, శివ పాల్గొన్నారు.

రామసముద్రంలో వీధి కుక్కల స్వైర విహారం



రామసముద్రంలో వీధి కుక్కల దాడిలో గాయపడిన దూడలు



రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దూడలతో నిరసన చేస్తున్న బాధితులు

- దూడలు, మేకలు, పిల్లలపై దాడి
- పట్టించుకోని అధికారులు

రామసముద్రం : రామసముద్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా ఊటుగొల్లపల్లి, గాజులనగర్, ఆంజనేయస్వామి కాలనీల్లో దూడలపై, మేకలపై, చిన్నారులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దీంతో ప్రజలు దూడలు, మేకలు బయట కట్టేసేందుకు భయపడుతున్నారు. సుమారు పది దూడల చెవులు, కన్నులు కొరికేసి గాయపరచడంతో బాధితులు సోమవారం గాయపడిన దూడలతో రామసముద్రం సచివాలయం వద్ద చేరుకుని వారికి విన్నవించారు. అక్కడ సచివాలయ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన బాధితులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. స్పందించిన అధికారులు చర్యలు తీసుకుంటామని తెలపడంతో వారు వెనుదిరిగారు.

కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు



సిద్దవటంలో కుక్క కాటుకు గాయపడిన తుమ్మలకుంట శ్రీనివాసులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎగువపేటకు చెందిన తుమ్మలకుంట శ్రీనివాసులు అనే వ్యక్తిని ఆదివారం రాత్రి పిచ్చికుక్క కరవడంతో తీవ్ర గాయమైంది. సిద్దవటం ఆసుపత్రిలో చికిత్స పొందాడు. గ్రామంలో కుక్కల దాడులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు కుక్కలను బంధించి సుదూర ప్రాంతాల్లో వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర అమలు చేయాలి



మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం వాహనమిత్రను అమలు చేసి ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ పాత బస్టాండు వద్ద సోమవారం ఆటో డ్రైవర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణ పేరుతో 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన నూతన మోటారు చట్టం 106(1)(2)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు, మోటారు కార్మికులకు రూ.15వేలు అందించే వాహనమిత్ర పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ నాయకులు సురేష్, నాయక్, ఆకాష్, హరీ, నరసింహ, మహమ్మద్ పాల్గొన్నారు.

దళారుల మోసాన్ని అరికట్టండి



రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, రైతులు

ఓబులవారిపల్లె : దళారుల చేతిలో బొప్పాయి రైతులు మోసపోతూనే ఉన్నారని, కలెక్టర్ స్వయంగా నిర్ణయించిన ధర కంటే రైతులకు తక్కువగా చెల్లిస్తున్నారని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు బొప్పాయి పంట రేట్లు దళారులు తగ్గించడంతో ఈనెల 1వ తేదీన జిల్లా కలెక్టర్ బొప్పాయి రైతులతో, దళారులతో సమావేశం నిర్వహించారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా కనీస ధర రూ. 9 అమలు చేయాలని, 6వ తేదీ నుంచి పది రూపాయలు అమలు చేయాలని నిర్ణయించారన్నారు. 6వ తేదీ వరకు రూ.9 అమలు చేసిన దళారులు ఆ తర్వాత ఎనిమిది రూపాయలకు, ప్రస్తుతం ఏడు రూపాయలకు తగ్గించారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కనీస ధర రూ.15గా నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువ కౌలు రైతు మృతి

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో సోమవారం పొలం వద్ద మోటారు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రాటాల పవన్‌కుమార్ (38) అనే యువ కౌలు రైతు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లెకు చెందిన రాటాల లక్ష్మీనారాయణకు ముగ్గురు కుమారులు. వారిలో రెండో కుమారుడు పవన్‌కుమార్‌కు 11 ఏళ్ల కిందట మైదుకూరుకు చెందిన లక్ష్మీదేవితో వివాహమైంది. బాచేపల్లెలో సొంత పొలం ఒక ఎకరాకు తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పవన్‌కుమార్ పంటలు సాగు చేస్తున్నాడు. మూడేళ్ల కిందట మైదుకూరుకు నివాసాన్ని మార్చి ఇక్కడ కొందరి రైతుల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. స్థానిక ఎర్రచెరువు ప్రాంతంలో కౌలుకు తీసుకున్న పది ఎకరాల పొలంలో వరి నాటాల్సి ఉంది. సోమవారం వరి నాటేందుకు సిద్ధం చేయడానికి బాడుగ ట్రాక్టర్‌ను పిలుచుకొని వెళ్లాడు. పొలానికి నీరు పెట్టేందుకు ఉదయం 11 గంటల ప్రాంతంలో మోటారు ఆన్ చేశాడు. విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

సెంట్రల్ జైలులో అవినీతి కిరణం!

- పెట్రోల్ బంక్‌లో రూ.7లక్షలు విలువైన ఆయిల్ స్వాహా
- కాంపౌండ్ వాల్ నిర్మాణంలో నిబంధనలు పాటించని వైనం
- ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన ఓ ఉన్నతాధికారి
- దొంగ చేతికి తాళమిచ్చినట్లుగా అదనపు బాధ్యతలు



సాక్షి ప్రతినిధి, కడప : సత్‌ప్రవర్తన నేర్పించాల్సిన సిబ్బంది స్వయంగా ఖైదీలకు తప్పుడు నడతను అలవాటు చేస్తున్నారు. డబ్బులు ఇస్తే ఎంజాయ్ చేసేందుకు కావాల్సిన సదుపాయాలు సమకూరుస్తున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లుగా అవినీతి 'కిరణం' అండ చూసుకుని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పెట్రోల్ బంకులో చోటుచేసుకున్న అవినీతి విషయంలో ఇప్పటికీ చర్యల్లేవు. వెరసి కడప సెంట్రల్ జైలులో తప్పు మీద తప్పులు దొర్లుతున్నాయి.

కడప కేంద్ర కారాగారం తరచూ వార్తల్లోకి ఎక్కుతోంది. ఖైదీలకు కావాల్సిన సదుపాయాలు కల్పించడంలో ఓ ఉన్నతాధికారిది అందెవేసిన చేయిగా చెప్పుకొస్తున్నారు. గతంలో కొందరు ఖైదీలకు ఏకంగా 600 రోజులు ఉపశమనం కల్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లినా నిష్ప్రయోజనమే అయింది. ఉన్నతాధికారి భయాందోళనలకు గురి చేయడంతో సిబ్బంది మౌనం దాల్చారు. ఖైదీలచే నిర్వహిస్తున్న పెట్రోల్ పంపులో సుమారు రూ.7లక్షలు అవినీతికి ఆస్కారమిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ డిప్యూటీ జైలర్‌ను బాధ్యుడిని చేస్తూ నివేదికలు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు లేవు. అలాగే కేంద్ర కారాగారం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు రూ.3.15 కోట్లు ప్రిజనర్స్ డెవలప్‌మెంట్ నిధి ద్వారా మంజూరు చేశారు. అందులో మెటీరియల్ కొనుగోలు కమిటీతో సంబంధం లేకుండా రూ.1. 3 కోట్లు ఏకంగా హెడ్ ఆఫీసును తప్పుదారి పట్టించి ప్రొసీజర్స్‌ను ఉల్లంఘించారు. ఇలాంటివి తరచూ చోటుచేసుకుంటుండడంతో సిబ్బంది సైతం పెడదారి పట్టినట్లు సమాచారం.

సీఎంఓకు ఫిర్యాదుల పరంపర..

కడప సెంట్రల్ జైలు ఉన్నతాధికారి ఒకరు ఇష్టానుసారంగా వ్యవహరించారని ప్రొసీజర్స్ ఉల్లంఘించారని, సివిల్ వర్క్సులో అవినీతికి పాల్పడ్డారని అనేక ఫిర్యాదులు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు, హోంమంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇదివరకూ పర్యవేక్షణాధికారిగా పనిచేసి అవినీతికి పాల్పడిన వ్యక్తికే అదనపు బాధ్యతలు కూడా కట్టబెట్టారని చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు ఫిర్యాదుల పరంపరను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

కడప కేంద్ర కారాగారంలో విచారణ

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో గతంలో జరిగిన వైద్య శిబిరం, ఇతర అంశాలపై సమగ్రంగా విచారణ జరపాలని ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, జైళ్ల శాఖ విజయవాడ కారాగారం సూపరింటెండెంట్ ఇర్ఫాన్, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్‌ను సభ్యులుగా చేర్చి కమిటీ నియమించారు. ఇందులో భాగంగా గతంలో కడప కేంద్ర కారాగారంలో వైద్యుడిగా పనిచేసిన డాక్టర్ ప్రవీణ్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పిలిపించి పలు అంశాలపై విచారించారు. మంగళవారం డాక్టర్ పుష్పలత, తర్వాత బాధ్యులైన కొందరిని పిలిపించి విచారించనున్నారు. అలాగే పోలీస్ శాఖ, జైళ్ల శాఖ, రెవెన్యూ శాఖల నుంచి కమిటీలో నియమితులైన అధికారులు ఆయా శాఖల వారిని విచారించనున్నారు.